
నడకుదురు పంచాయతీ నాదెళ్లవారిపాలెంలో దెబ్బతిన్న అరటి తోట


ఎడ్లంకలో కృష్ణానదిలో కలిసి పోయేందుకు సిద్ధంగా ఉన్న తిరుపతమ్మ ఆలయం


కోతకు గురైన ఎదురుమొండి - గొల్లమంద రహదారి


నాగాయితిప్పలో అరటి పంటను పరిశీలిస్తున్న కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి

ఉధృతంగా వరద

- వర్షంనీటిలోనే పంటపొలాలు
- వరద పెరిగితే పులిగడ్డలో పలు గ్రామాలు నీట మునిగే ప్రమాదం
- పలు చోట్ల కోతకు గురైన రహదారులు


ఉల్లిపాలెం సమీపంలో నిండుకుండలా కృష్ణమ్మ

అవనిగడ్డ: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి అవనిగడ్డ మండలంలోని ఎడ్లంకను వరద నీరు ముంచెత్తింది. ఈ గ్రామానికి వెళ్లే కాజ్‌వే రహదారి కొట్టుకుపోవడంతో గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ప్రకాశం బ్యారేజీ నుంచి 5.52లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో పులిగడ్డ అక్విడెక్టు వద్ద వరద ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ప్రవాహం మరింత పెరిగితే దివిసీమలోని పలు గ్రామాలు నీటమునిగే ప్రమాదముంది. సీఐ యువకుమార్, ఎస్‌ఐ శ్రీనివాస్, తహసీల్దార్ కె. నాగమల్లేశ్వరావు ఎడ్లంకలో పర్యటించారు. ఎడ్లంక పల్లెపాలెంలో కృష్ణానది ఒడ్డున నిర్మించిన తిరుపతమ్మ ఆలయం ఏ క్షణంలోనైనా కృష్ణానదిలో కలిసిపోయే ప్రమాదం ఉంది. అవనిగడ్డ మండలం పులిగడ్డ వద్ద ప్రస్తుతం 15 అడుగుల మేర వరద నీటి ప్రవాహం ఉంది.

ఎదురుమొండిదీవి(నాగాయలంక): దీవిలోని ఎదురుమొండి – గొల్లమంద మీదుగా సముద్రతీర గ్రామం జింకపాలెం వెళ్లే ప్రధాన రోడ్డు కృష్ణానది వరద తాకిడికి కోతకు గురవుతోంది. దీంతో ఈ మార్గంలో ప్రయాణించాలంటే గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. ఈ రహదారి కోసం డెప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రూ.13 కోట్లు మంజూరు చేశారని ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ గొప్పలు చెప్పుకున్నారు. కానీ ఇంతవరకూ కార్యరూపం దాల్చలేదు.

కృష్ణా కరకట్టకు భారీ కోత

కోడూరు: తీరప్రాంత ప్రజలకు రక్షణ కవచమైన కృష్ణా కరకట్ట భారీగా కోతకు గురైయింది. హంసలదీవి – ఉల్లిపాలెం గ్రామాల మధ్య కరకట్ట పలు ప్రాంతాల్లో సుమారు ఐదడుగుల మేర కోతకు గురైయింది. కరకట్టకు భారీగా కోత ఏర్పడిన కూడా అధికారులు కనీస రక్షణ చర్యలు చేపట్టలేదు. ఈ కరకట్టకు కోత ఏర్పడిన ప్రాంతాన్ని జెడ్పీ సీఈఓ కే.కన్నంనాయుడు పరిశీలించారు. మండలంలోని ఆక్వా చెరువులకు ముంపు వాటిల్లే ప్రమాదం ఉందని ఆక్వా రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెడన: పట్టణంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో బుధవారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి నీరు నిలిచి రాకపోవడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. గురువారం మున్సిపల్ ఏఈ కె. సీతారామాంజనేయులు ఆయా ప్రాంతాలను పరిశీలించారు. వర్షం నీరు బయటకు పోయేలా చూడాలని సిబ్బందికి సూచించారు.

శ్రీరామపాద క్షేత్రం ఘాట్ మునక

నాగాయలంక: నాగాయలంకలో కృష్ణానది ఉధృతంగా ప్రవహిస్తోంది. స్థానిక శ్రీరామపాద క్షేత్రం పుష్కరఘాట్‌లో గురువారం సాయంత్రానికి కృష్ణానది వరద నీటి మట్టం ఆరు అడుగుల మేర ఎత్తు పెరిగింది. నాగాయలంక ఎస్‌ఐ కలిదిండి రాజేష్ పంటు, బోట్ల యజమానులకు ముందు జాగ్రత్త నోటీసులు అందచేశారు. కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీరామలింగేశ్వరస్వామి మండపం నదిలో మునిగింది.

కోడూరు: మండలంలోని పలు గ్రామాల్లో వరిపొలాలు నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, ఏఓ శ్రీధర్, ఎంపీడీఓ సుధాప్రవీణ్ సిబ్బందితో కలిసి పొలాలను పరిశీలించారు.

చల్లపల్లి: కృష్ణానది తీరప్రాంతమైన మండలంలోని ఆముదార్లంక గ్రామంలో అవనిగడ్డ డీఎస్పీ టి.విద్యశ్రీ గురువారం పర్యటించారు. వరద ముంపు పరిస్థితిపై గ్రామస్థులకు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారు.


జలదిగ్బంధంలో బంటుమిల్లి జగనన్న కాలనీ


చల్లపల్లి మండలం కొత్తమాజేరులో నీటిలో మునిగిన వరిపైరు


కొత్తమాజేరులోని ఎన్టీఆర్ కాలనీలో నీటమునిగిన గృహాలు


ఉల్లిపాలెం, హంసలదీవి కరకట్టకు ఏర్పడిన కోత


లక్ష్మీపురం పంచాయతీ శివారు చెంచుకాలనీలో వర్షంనీటిలో అంగన్‌వాడీ కేంద్రం


నడకుదురు వద్ద మునిగిన పసుపు పంటను చూపిస్తున్న రైతు


కృష్ణాకరకట్టపై విరిగి పడిన చెట్లు


ఉల్లిపాలెం సమీపంలో చెరువును తలపిస్తున్న వరిపొలాలు

భూగర్భజలాల పెంపునకు చర్యలు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో భూగర్భజలాల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ తెలిపారు. రాష్ట్ర సచివాలయం నుంచి సీఎం చంద్రబాబునాయుడు జిల్లా కలెక్టర్లతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ కలెక్టర్ గీతాంజలిశర్మ పాల్గొని జిల్లాలోని పరిస్థితులను వివరించారు. జిల్లాలోని గన్నవరం, బాపులపాడు, గుడివాడ, పెనమలూరు అప్‌ల్యాండ్ మండలాల్లో బోరుబావుల అధిక వినియోగం వల్ల భూగర్భజలాలు తక్కువ స్థాయిలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం సూచించిన విధంగా నీటి వినియోగదారుల సంఘాల సహకారంతో భూగర్భజలాలు మెరుగుదలకు చర్యలు తీసుకుంటామని వివరించారు. కాన్ఫరెన్స్‌లో డీఆర్వో చంద్రశేఖరరావు, ఇరిగేషన్ ఎస్ఈ మోహనరావు, సాగు నీటి సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఎరువుల షాపు తనిఖీ

మోపిదేవి: మోపిదేవిలో సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్ ఎరువుల షాపును గురువారం అవనిగడ్డ సహాయ వ్యవసాయ సంచాలకులు జె.ఎస్. జయప్రద తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డుల్లోని స్టాక్ బ్యాలెన్స్‌గా ఉండాలని సూచించారు. మండల ఏఓ హెప్సీబా రాణీ, గ్రామ వ్యవసాయ సహాయకులు యశ్వంత్, రవిచంద్ర పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అక్రమ వలకట్లు తొలగింపు

నాగాయలంక: మండలంలోని మంగలేరు డ్రైయిన్‌లో అక్రమంగా నిర్మించిన వలకట్లను గురువారం తొలగించారు. మీడియం డ్రైయిన్‌లలో అడ్డుగా ఉన్న వలకట్లు తొలగింపునకు రెండు మూడు రోజులు పడుతుందని డ్రైయినేజీ డీఈఈ జె.బాబునాయక్, ఏఈఈ చిరంజీవులు పేర్కొన్నారు. మురుగు పారుదల స్తంభించి రైతాంగాన్ని ఇబ్బందులు పెడుతూ ఔట్‌ఫాల్స్ స్లూయిస్‌ల వద్ద షట్టర్లకు ఏర్పాటు చేస్తున్న వలలను నిరోధించినట్లు ఇరిగేషన్ ఏఈఈ పాన్నూరు రవితేజ చెప్పారు. కాగా రైతులకు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని డీసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు బీసాబత్తుని ప్రసాద్ డిమాండ్ చేశారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని 49వ డివిజన్ నారాయణపురం యానాదుల కాలనీలోని ఎలిమెంటరీ పాఠశాల విద్యార్థులకు గురువారం స్కూల్ బ్యాగులను ఉచితంగా పంపిణీ చేశారు. కృష్ణాజిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మాజీ సభ్యుడు వంపుగడవల చౌదరి ఆధ్వర్యంలో బ్యాగులను విద్యార్థులకు అందజేశారు. తూము మధుసూదనరావు, రిటైర్డ్ టీచర్ బ్రహ్మం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రకటన

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

ఆర్డీవో కె. స్వాతి



చిలకలపూడి(మచిలీపట్నం): లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మచిలీపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి కె. స్వాతి హెచ్చరించారు. కలెక్టరేట్‌లోని ఆమె కార్యాలయంలో గురువారం పీసీపీఎన్‌డీటీ చట్టంపై కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే వారిపై మాత్రమే కాకుండా అడిగిన వారు, ప్రోత్సహించిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డివిజన్‌లో ఉన్న స్కానింగ్ కేంద్రాలు తప్పనిసరిగా నమోదు చేసుకుని ఐదేళ్లకోసారి రెన్యువల్ చేసుకోవాలని చెప్పారు. ప్రతి స్కానింగ్ కేంద్రంలో ధరల పట్టిక, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. మచిలీపట్నం డివిజన్ పరిధిలో ఆరు ప్రభుత్వ, 30 ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని వీటితో పాటు కొత్తగా రెండు స్కానింగ్ కేంద్రాలు రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. సమావేశంలో డీఎస్పీ చప్పిడి రాజా, డాక్టర్ ప్రేమ్‌చంద్, డివిజనల్ పౌరసంబంధాల అధికారి జి. రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

రావివారిపాలెం(మోపిదేవి): మండలంలోని పెదప్రోలు గ్రామానికి చెందిన వేముల వెంకటేశ్వరరావుకు మెదడులో రక్త ప్రసారంలో ఇబ్బందుల వల్ల అనారోగ్యంతో విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న తెలుగువన్ ఫౌండేషన్ ప్రతినిధి కంఠంనేని శివశంకర్ ఆపరేషన్ నిమిత్తం రూ. 75 వేలు బాధిత కుంటుంబానికి గురువారం అందజేశారు.

త్రిసభ్య కమిటీ సభ్యులు బాధ్యతల స్వీకారం

మోపిదేవి: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ప్రాథమిక సహకార వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) త్రిసభ్య కమిటీ సభ్యులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మోపిదేవి చైర్మన్‌గా పరుచూరి శ్రీనివాసరావు, పెదప్రోలు చైర్మన్‌గా నాదెళ్ల శరత్‌శ్చంద్రబాబు, కె. కొత్తపాలెంకు రత్న గోపాల్, కోసూరువారిపాలెంకు కోసూరు నాగమల్లేశ్వరావు, మెరకనపల్లికు యర్రంశెట్టి సుబ్బారావు, నాగాయితిప్పకు బల్లా సీతారామ ప్రసాద్ చైర్మన్‌లతోపాటు ఆయా సొసైటీల సభ్యులు బాధ్యతలు స్వీకరించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం(ఘంటసాల): కృష్ణానది పరివాహక ప్రాంతాలైన శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ తెలిపారు. ఘంటసాల మండలం శ్రీకాకుళం, పాపవినాశనం గ్రామాల్లోని కృష్ణానదిలో వరద ఉధృతి పెరగడంతో గురువారం ఆయన సిబ్బందితో కలసి పర్యటించారు.

వైభవంగా గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ



పెడన: మండలంలోని కూడూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో గురువారం గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ జరిగింది. గత మూడు రోజులుగా హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించిన పిమ్మట విగ్రహ ప్రతిష్ఠ వేదమంత్రాల నడుమ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ పెడన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉప్పాల రాము, ఉమ్మడి కృష్ణాజిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక దంపతులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు దావు భైరవలింగం, నాయకులు కాగిత వెంకటేశ్వరరావు, కాగిత శ్రీహరి, సర్పంచు కాగిత విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఘనంగా హర్‌ఘర్ తిరంగా



మచిలీపట్నంటౌన్: ఛాంబర్ ఆఫ్ కామర్స్ మచిలీపట్నం శాఖ ఆధ్వర్యంలో గురువారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. దేశ సమైక్యత వర్ధిల్లాలి.. వందేమాతరం.. భారత్ మాతాకీ జై.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ స్థానిక కోనేరుసెంటర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు ఊర రామాంజనేయులు, వ్యాపారులు పాల్గొన్నారు.

తెలుగురావుపాలెం(ఘంటసాల): ఘంటసాల మండలం తెలుగురావుపాలెంలోని సెయింట్ జోసఫ్ కాన్వెంట్ విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు.

ఘంటసాల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాలలోని వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ గురువారం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.సత్యప్రియ లలిత, శాస్త్రవేత్తలు కె.లహరి, జె.పద్మావతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మౌలిక సౌకర్యాలు కల్పించండి

బంటుమిల్లి: స్థానిక జగనన్న కాలనీలో ప్రభుత్వం మౌలిక సౌకర్యాలు కల్పించాలని రైతు, కార్మిక సంఘాలు గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశాయి. గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు కాలనీ మొత్తం వర్షంనీటిలో ఉందని తెలిపారు. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి స్థానిక జగనన్న కాలనీలో రోడ్లు, తాగునీరు సౌకర్యాలు కల్పించి కాలనీవాసులను ఆదుకోవాలని రైతు సంఘం, కార్మిక సంఘ నాయకులు జి.నాగేశ్వరరావు, ఎం. శ్రీనివాసరావు, పి ధనశ్రీ డిమాండ్ చేశారు.

స్వామిత్ర సర్వే పకడ్బందీగా చేయాలి

పెడన: స్వామిత్ర సర్వేతో పాటు ఐవీఆర్‌ఎస్ సర్వేలు పకడ్బందీగా ఉండాలని మచిలీపట్నం డీఎల్‌పీవో రజావుల్లా అన్నారు. గురువారం ఆయన మండలంలోని మడక గ్రామంలో పర్యటించారు. ఐవీఆర్‌ఎస్ సర్వే వంద శాతం రాగా ఇప్పుడు 50 శాతం రావడంపై ఆయన విచారణ చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి క్లాప్ మిత్రలు స్వయంగా వస్తుంది లేనిది ఆరా తీశారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి డీఎల్‌పీవో పలు సూచనలు చేశారు. డెప్యూటీ ఎంపీడీవో ఎం.నాగిరెడ్డి, సర్పంచు జోగి వెంకటలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంటపొలాలు పరిశీలన



తలగడదీవి(నాగాయలంక): మండలంలోని తలగడదీవి, గణపేశ్వరం, పెదగౌడపాలెం, పర్రచివర తదితర ప్రాంతాల్లో భారీ వర్షానికి నీటమునిగిన వరిపొలాలను నాగాయలంక డీసీ చైర్మన్ చైర్మన్ బండ్రెడ్డి నాగమల్లికార్జునరావు (చినబాబు) గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులు ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. పొలాల్లోని నీరు తక్షణం తొలగిపోవడానికి చర్యలు చేపట్టాలని డీసీ చైర్మన్ వ్యవవసాయశాఖ, ఇరిగేషన్ అధికారులకు సూచించారు. టి.కొత్తపాలెం మాజీ సర్పంచ్ మెండు లక్ష్మణరావు, ఏఎంసీ డైరక్టర్ ఉప్పల ప్రసాద్, నీటి సంఘాల అధ్యక్షులు, రైతులు పాల్గొన్నారు.

మోపిదేవి: మండలంలోని నాగాయితిప్ప, కోసూరువారిపాలెం గ్రామాల్లో గురువారం కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ మంజువాణి పర్యటించి పలు పసుపు, కంద, అరటి, కూరగాయ పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. గత మూడు రోజులుగా అధిక వర్షాలు కురుస్తున్న కారణంగా, వివిధ ఉద్యాన పంటలు నీట మునిగాయని తెలిపారు. ముందుగా పొలాల్లోని నీటిని బయటకు పంపి, వర్షాలు తగ్గాక వ్యవసాయాధికులు, కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త సూచనలతో తగిన చర్యలు తీసుకోవాలని రైతులకు వివరించారు.

ఐక్యతే భారత్ బలం

మచిలీపట్నంటౌన్: స్థానిక పీఎం కేంద్రీయ విద్యాలయంలో ఏక్ భారత్ శ్రేష్ట భారత్‌లో భాగంగా కేవీఎస్ రాష్ట్రీయ ఎక్తా పర్వ్- 2025 కళా ఉత్సవ్ కార్యక్రమం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ జె.సత్యనారాయణ మాట్లాడుతూ ఐక్యతే భారత్ బలమని పేర్కొన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రాంతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారన్నారు. శాస్త్రీయ, జానపద నృత్యం, జానపద బృంద నృత్యం, దేశభక్తి గీతాలు, చిత్రలేఖనం, 2డీ, 3డీ కళాఖండాలు తయారీ మొదలగు 16 రకాల అంశాల్లో పోటీలు నిర్వహించారు.